# 34

# కోడలి తెలివి

ఒక ఊరిలో నరహరి అనే ధనవంతుడుండేవాడు.

అతనికి శ్రీహరి ఒక్కగానొక్క కొడుకు. తన కుమారునికి ఘనమైన సంబంధం తేవాలని ఊరూ వాడా వెదికి 'రాణి' అనే ఆమెతో వివాహం చేశాడు.

కోడలు కాపరానికి వచ్చాక, ఆమె తెలివితేటలు పరీక్షించాలనుకున్నాడు. ఆమెని పిలిచి, "అమ్మాయీ... నీ పెళ్ళి ఇంత ఘనంగా చేశానుకదా, దీనికి ఎంత ఖర్చయి వుంటుందో చెప్పుకో చూద్దాం!" అన్నాడు సగర్వంగా మీసాలు మెలేసుకుంటూ.

రాణి – "ఆ... శేరు బియ్యం ఎత్తు చెయ్యదు" అంటూ పెదవి విరిచింది.

నరహరికి ఒళ్ళు మండిపోయింది. 'తన కోడలు మూర్ఖురాలైనా కావాలి, లేదా–పొగరుబోతైనా కావాలి' అనుకొని ఆ అమ్మాయిని పుట్టింటికి పంపించేసి, కొడుక్కి మళ్ళీ పెళ్ళి చెయ్యాలనుకున్నాడు. తన నిర్ణయం కొడుక్కి చెప్పాడు. తండ్రి మాట కాదనలేని శ్రీహరి అందుకు ఒప్పుకున్నాడు.

మర్నాడు నరహరి కొడుకునూ, కోడలునూ వెంటబెట్టుకుని ఆమె పుట్టింట్లో దించివేయడానికి బయలుదేరాడు. వాళ్ళు కొంచెం దూరం వెళ్లేసరికి కొందరు ఒక శవాన్ని మోస్తూ ఎదురయ్యారు.

వారిని చూసి రాణి – "ఈయన చచ్చింది ఒకసారా.., వందసార్లా?" అని అడిగింది.

వారికి కోపం వచ్చి కొట్టేంత పని చేశారు. నరహరి ఎలాగోలా వారికి సర్దిచెప్పి పంపించేశాడు. ఈ సంఘటనతో... 'కోడలు మూర్ఖురాలు' అనే నమ్మకం బలపడిపోయింది నరహరికి.

మరికొంత దూరం వెళ్లేసరికి.., కొందరు పొలంలో పండిన పంటను కోస్తున్నారు

అది చూసి రాణి – "ఈ పంట నిరుటిదో.., ఈ యేటిదో?" అని అడిగింది.



అది విని వాళ్ళు కయ్యానికి వచ్చారు. నరహరి వాళ్ళకి సర్దిచెప్పి త్వరగా కోడల్ని వదిలించుకోవాలన్న ఆలోచనతో త్వరత్వరగా ముందుకి సాగాడు.

ఆ రాత్రికి వారు ఒక సత్రంలో బస చేశారు.

నరహరికి సూర్యోదయానికి ముందే నిద్రలేవడం అలవాటు. అలాగే లేచి చూసేసరికి రాణి కనిపించలేదు. తండ్రీకొడుకులు వెతగ్గా వెతగ్గా... ఒక రావిచెట్టు క్రింద కూర్చుని చెట్టుపైన అరుస్తున్న ఒక పిట్ట కూతలను శ్రద్ధగా చెవులు రిక్కించి వింటూ రాణి కనిపించింది. కొంచెంసేపటికి ఆమె చెట్టుక్రింద గొయ్యి తవ్వి , అందులోంచి ఒక పాత్రను తీసింది. అందులో పైనున్న ధాన్యాన్ని తీసి పిట్టకి వేసింది. క్రింద వున్న బంగారు నాణాలనూ, నగలనూ తాను తీసుకుంది.

అది చూడగానే- పక్షుల భాషను కూడా అర్థం చేసుకోగలిగిన తన కోడలు చాలా తెలివిగలదని, తనే ఆమెను పొరపాటుగా అర్థంచేసుకున్నానని భావించాడు నరహరి.

రాణి దగ్గరకు వచ్చి "ఇంటికి పోదాం ర"మ్మని బలవంతపెట్టాడు.

ముందు కొంతసేపు బెట్టు చేసి, తర్వాత కొంతసేపు బ్రతిమాలించుకుని, చివరికి - భర్త, మామల వెంట ఇంటకి బయలుదేరింది రాణి.

దారిలో నరహరి ఆమెను -"చెట్టు క్రింద బంగారు పాత్ర వుందన్న విషయం ఎలా తెలుసుకున్నావు?" అని అడిగాడు.

"నాకు పక్షిభాష వచ్చు. 'చెట్టు క్రింద ధాన్యాలు వున్న పాత్ర వున్నా ఆ గింజలు తీసి నాకెవరూ వేయడంలేదు. పోని... దాని క్రింద వున్న బంగారు నిధిని కూడా ఎవరూ తీసుకోవడం లేదు' అంటూ ఈ పక్షి ఆక్రోశించడం విని ఆ నిధిని కనుగొన్నాను" అని చెప్పింది రాణి.

"సరే! చనిపోయినవ్యక్తిని గురించి అలా అడిగావెందుకు?" అని మళ్ళీ అడిగాడు నరహరి.

"గౌరవంగా, ధీరుడుగా బ్రతికిన వాడికి చావు ఒకేసారి వస్తుంది. కాని – గౌరవంలేని బ్రతుక, పిరికివారికి పదే పదే వస్తుంటుంది. ఆ చనిపోయినవాడు ఎటువంటివాడో తెలుసుకుందామని అలా అడిగాను" అంది రాణి.

కోడలు తెలివికి ముక్కు మీద వేలేసుకున్నాడు నరహరి. "బాగుంది..! మరి, పొలం పంట విషయం అలా ఎందుకు అడిగావు?" అని మళ్ళీ అడిగాడు.

"ఆ పొలం యజమానులు అప్పులలో వున్నారో, సుఖంగా వున్నారో తెలుసుకోవాలని ఆ విధంగా అడిగాను. పాత పంట మీద చేసిన అప్పుల్ని తీర్చలేనివారయితే కొత్తపంట వేయలేరు. కొత్త పంట వేశారంటే అప్పులు లేక సుఖంగా వున్నారన్నమాటేగా..!" అని జవాబిచ్చింది రాణి.

"సరే..! చివరగా ఒక ప్రశ్న- మరి, నేను ఎంతో ఖర్చు పెట్టి ఘనంగా పెళ్ళి చేశాను కదా... మరి, ఆ విషయం తెలిసే నేను పెట్టిన ఖర్చు శేరు బియ్యం విలువ చెయ్యదన్నావు. అది న్యాయమేనా?" అని అడిగాడు నరహరి.

"ఆ ఖర్చంతా మీరు ఆడంబరం కోసం చేసుకున్నారు. ఆ పెళ్ళిలో మా దంపతులు తిన్నది శేరు బియ్యం కూడా లేదు" అంది రాణి.

అంతటి తెలివిగల కోడలుతో తన కొడుకు ఎంతో సుఖపడగలడన్న నమ్మకం కుదిరి, ఇంటి పెత్తనం రాణికి అప్పజెప్పి తను తీర్థయాత్రలకు వెళ్లిపోయాడు నరహరి.

★★★